క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

అడ్డతీగల: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదు గడువు శుక్రవారంతో ముగుస్తుందని తహసీల్దార్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులందరూ త్వరగా ఓటు నమోదు చేసుకోవాలని, ఎన్నికల నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: ప్రభుత్వ పథకాలు పొందేందుకు వీలుగా ప్రజలు వారికి అవసరమైన పనులను చేయించుకోవాలని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మ్యుటేషన్లు కీలకమన్నారు. వాటిని చేయించుకోవాలని సూచించారు. దీని వల్ల కలిగే లాభాలను ఆయన వివరించారు. మ్యుటేషన్లు కాకుంటే కొన్ని సందర్భాల్లో పథకాలు నిలిచిపోయే ఆస్కారముంటుందన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సైతం సకాలంలో అందజేస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయవచ్చన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామన్నారు.

శిశు సంరక్షణపై అవగాహన


ఏరియా ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న న్యాయవాది సింహాచలం

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం ఘనంగా ప్రపంచ శిశు పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాది సింహాచలం మాట్లాడుతూ శిశు సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ నాగరాజు, కోర్టు సిబ్బంది రాములమ్మ, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రత్యేక చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం : గ్రామాల్లో నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, నూరుశాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ఉద్దేశ్యమని ఎంపీడీవో పి.జి.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం అములుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏపీఎం షణ్ముఖరావు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై సూచనలు


గూడమాలిపుట్టులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు కూరగాయల పెంపకంలో నాణ్యమైన విత్తనాలు వాడాలని ఏవో శ్రీనివాసబాబు అన్నారు. మండలంలోని పెదగూడ పంచాయతీ గూడమాలిపుట్టు గ్రామంలో కూరగాయల పెంపకంలో మేలైన సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసబాబు మాట్లాడుతూ కూరగాయల మొక్కలు నాటే ముందు లోతు దుక్కులు చేసుకోవాలని, వేప పిండి, పశువుల గత్తం సమపాళ్లలో కలిపి జల్లుకోవాలని, నారు పోసిన తరువాత బోదే సాల్ల పద్ధతిలో నారు పొలంలో నాటు కోవాలని సూచించారు. పాడేరు వ్యవసాయాధికారి విజయలక్ష్మి, పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత ప్రదీప్, ఉద్యానవన అధికారి శరణ్య, గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ అవస్థలు

- మూలకు చేరిన అంగన్‌వాడీ భవనాలు
- అరకొర సదుపాయాల నడుమ అద్దె ఇళ్లల్లో నిర్వహణ
- టేక్ హోం రేషన్ పద్ధతిలోనే పౌష్టికాహారం
- రాజవొమ్మంగి పరిధిలో 30 అక్కరకు రాని భవనాలు


రాజవొమ్మంగిలో అందుబాటులో లేని అంగన్‌వాడీ భవనం


అప్పలరాజుపేటలో శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ కేంద్ర భవనం

రాజవొమ్మంగి: చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించి, వారికి పోషకాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీతో పాటు మధ్యాహ్న భోజనం అందజేసేవారు. చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్యను అమల్లోకి తీసుకొచ్చారు. ఫలితంగా గ్రామస్తులకు అంగన్‌వాడీ సేవలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక అంగన్‌వాడీ వ్యవస్థను పట్టించుకోవడం లేదు.

కానరాని మౌలిక సదుపాయాలు

రాజవొమ్మంగి ఐసీడీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్) పరిధిలో మొత్తం 101 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ చాలా కేంద్రాలకు సొంత భవనాలు లేవు. ప్రస్తుతం పలు అంగన్‌వాడీ కేంద్రాలు అసౌకర్యాల నడుమ అద్దె ఇళ్లలోనే కొనసాగుతున్నాయి. అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతి సమస్య వేధిస్తోంది. కనీస మౌలిక సదుపాయాలు లేవు. పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలాలు లేక, మరుగుదొడ్లు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకైన గదుల్లో కనీసం వెలుతురు రాని ప్రదేశాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పిల్లలు మగ్గిపోతున్నారని తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో భవనాలు

మండలంలోని పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరకున్నాయి. గోడలు బీటలు వారి, శ్లాబ్ పెచ్చులూడిపడుతున్నాయని, వర్షం పడితే గదులన్నీ జలమయమవుతున్నాయని, సరకులు, రికార్డులు తడిసిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. శిథిలావస్థ భవనాల వల్ల ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అప్పలరాజుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. ఇక్కడ కేంద్రం చుట్టూ తుప్పలు పెరిగి అడవిని తలపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ భవనం స్థానంలో మరో భవనం నిర్మించాలనే విషయాన్ని సంభందిత అధికారులు పూర్తిగా విస్మరించారు. ఈ కేంద్రం పరిధిలో 15 మంది పిల్లలు, మరో ఆరుగురు బాలింతలు. గర్భిణులున్నారు. అలాగే మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ రాజుపేటలో అంగన్‌వాడీ కేంద్రం లేదు. దీంతో ఇక్కడ గల సుమారు 15 మంది పిల్లలు, గర్భిణులు. బాలింతలు టేక్ హోం రేషన్ పద్ధతి ద్వారా సమీప గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పౌష్టికాహారం తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రాజవొమ్మంగి ప్రాజెక్టు పరిధిలో పనులు పూర్తయిన పలు అంగన్‌వాడీ భవనాలను నేటికీ ఐసీడీఎస్ అధికారులకు అప్పగించ లేదు. దీంతో ఆ భవనాలు ఉపయోగంలోకి రాకుండానే దాదాపు శిథిలస్థితికి చేరుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొత్త భవనాలు ఉన్నప్పటికీ ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె ఇళ్లలోనే కొనసాగున్నాయి. ఈ భవనాలను స్త్రీ శిశుసంక్షేమశాఖకు అప్పగించకపోవడానికి గల కారణాలు సంబంధిత అధికారులు వెల్లడించకపోవడం గమనార్హం. ఈ కొత్త భవనాలు ఉపయోగంలోకి రాకపోవడం చిన్నారుల పాలిట శాపంగా మారింది. ఈ భవనాలకు ఫ్లోరింగ్, టాయ్‌లెట్స్ వంటి చిన్న చిన్న పనులు అసంపూర్తిగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను ఏర్పాటు చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిత్యం భయం భయం



అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. అద్దె ఇంట్లో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ సమీపంలో లోతైన పంట కాలువ ఉంది. పిల్లలు ఆడుకొంటు ఎక్కడ ఆ కాలువలో పడిపోతారోనని నిత్యం మేము ఆందోళన పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అప్పలరాజుపేటకు నూతన అంగన్‌వాడీ భవాన్ని మంజూరు చేయాలి

– కవ్వల చంద్రకళ, అప్పలరాజుపేట

నివేదిక పంపాం

మండలంలోని రాజవొమ్మంగి ప్రాజెక్టు పరిధిలో ఆరు భవనాలు మంజూరయ్యాయి. వీటిని నిర్మించేందుకు స్థలాలను గుర్తిస్తున్నాం. శిథిలావస్థలో ఉన్న భవనాలకు సంబంధించి ప్రభుత్వం నివేదిక ఇచ్చాం. సమస్య పరిష్కానికి చర్యలు తీసుకుంటాం.

– దేవమణి, సీడీపీవో, రాజవొమ్మంగి

గంజాయి అనర్థాలపై అవగాహన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ భూషణం

గంగవరం: మండల కేంద్రంలోని శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎస్‌ఐ డి.భూషణం గురువారం పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి పలు సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భూషణం మాట్లాడుతూ గంజాయి, సారాకు దూరంగా ఉండాలన్నారు. మద్యం, మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఆన్‌లైన్‌లో రుణ యాప్‌ల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. దీంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అడవి జంతువులు వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చవద్దని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పిల్లలకు తప్పనిసరిగా బడికి పంపాలని, విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. దీంతో పిల్లలు ప్రయోజకులుగా మారడంతో పేద కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు.ఉపాధ్యాయులు పేద పిల్లల విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. ఉపాధి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల దీక్షలు


కొయ్యూరులో వీవోఏ దీక్షలో కూర్చొని సంఘీభావం తెలియజేస్తున్న ఎంపీపీ రమేష్


చింతపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు


ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సన్నిబాబు

డుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/పెదబయలు/జి.మాడుగుల/చింతపల్లి/కొయ్యూరు: ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడేళ్ల ఉద్యోగ కాలపరిమితి జీవో రద్దు చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో వెలుగు వీవోఏలు జిల్లా వ్యాప్తంగా గురువారం దీక్షలు చేపట్టారు. వారికి సీఐటీయూ, గిరిజన సంఘాలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ వీవోఏలకు మూడు సంవత్సరాల కాలం సర్క్యూలర్ రద్దు చేసి, ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, అధికారుల అక్రమ వేధింపులు, తొలగింపులు ఆపాలన్నారు. వీవోఏలకు నూతన సర్క్యూలర్ వల్ల అన్యాయం జరుగుతుందని, వీవోఏలను మధ్యంతరంగా రాష్ట్ర ప్రభుత్వం తొలగించే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమని, వెంటనే ఆ చర్యలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. నాయకులు భాస్కర్, శంకర్‌రావు, భీమరాజు, త్రినాథ్, జ్యోతి, రాజారావు, సన్నిబాబు, సునీల్‌కుమార్, వరలక్ష్మి, వెంకటరత్నం, మహేష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. కొయ్యూరులో దీక్ష చేస్తున్న వీవోఏలకు ఎంపీపీ బడుగు రమేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. నెలల తరబడి జీతాలు లేక వీవోఏల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, కూటమి ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లించి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.

సంప్రదాయ వైద్యంతో ఆరోగ్య రక్షణ


అవగాహన కల్పిస్తున్న జాతీయ ఆయుష్మాన్ మిషన్ వైద్యాధికారి త్యాగరాజు

హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జాతీయ ఆయుస్మాన్ మిషన్ వైద్యాధికారి త్యాగరాజు గురువారం సందర్శించారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి, ,ఉప్ప ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలోని ఆశా కార్యకర్తలతో బీపీ, సుగర్ వ్యాధులపై అవవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలో అనేక ఔషధ గుణాలు కలిగిన మొక్కలు ఉన్నాయని వాటిని గుర్తించి వినియోగిస్తే వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. మన్యంలో బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతల్లో లభించే పసుపు, వనమూలికలు, అల్లం, ఉసిరికాయలు వంటివి అటవీ ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. సంప్రదాయ వైద్యంతో ఆరోగ్య రక్షణ కలుగుతుందన్నారు. వైద్యాధికారి డాక్టర్ సౌజన్య, మానసి సంస్థ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమ్మేళన సభ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమ్మేళన సభను శుక్రవారం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు తెలిపారు.ఈ సభకు అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వర రాజు,శాసన మండలి సభ్యులు కుంభ రవిబాబు, ఉమ్మిడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిలు హాజరు అవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సంతోషికుమారి, సర్పంచ్ అప్పారావు

అనంతగిరి(అరకులోయ రూరల్): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీడీపీవో సంతోషికుమారి తెలిపారు. మండలంలో గుమ్మకోట గురుకులం పాఠశాలలో గంజాయి, డ్రగ్స్, మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత స్థాయికి చేరగలమన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలన్నారు. సర్పంచ్ అప్పారావు, ప్రిన్సిపాల్ నర్సింహమూర్తి, సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, సింహాచలం, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం


అర్జున్ (ఫైల్)

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొచ్చ అర్జున్ గుండెపోటుకు గురై రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన ఈనెల 4న పాఠశాలలో పిల్లలకు పాఠాలు బోధిస్తూ హఠాత్తుగా కింద పడిపోయారు. చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతితో స్వగ్రామం తంటికొండలో విషాదం అలముకొంది. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.ఆయన మృతికి సహచర ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరుల సంతాపం తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి


రాజవొమ్మంగిలో తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న 108 సిబ్బంది


ముంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న 104 ఉద్యోగులు

జి.మాడుగుల/ముంచంగిపుట్టు/రాజవొమ్మంగి: బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ 104 సిబ్బంది జి.మాడుగుల, ముంచంగిపుట్టు మండల కేంద్రాల్లో గురువారం ఆందోళన చేపట్టారు. 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజుపడాల్ మాట్లాడుతూ 14ఏళ్లుగా పనిచేస్తున్న 104 ఉద్యోగులకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని, కనీస ఉద్యోగ భద్రత లేదన్నారు. 104 సర్వీస్‌లో డ్రైవర్లుకు, డీఈవోలకు ఉద్యోగభద్రత కల్పించి వేతనాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వాహనాల ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్‌లు వెంటనే చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రవిచంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ముంచంగిపుట్టులో 104 సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కిలగాడ వైద్యాధికారి శిరీషకు వినతిపత్రాన్ని అందజేశారు.


జి.మాడుగులలో వైద్యాధికారి రవిచంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

రాజవొమ్మంగి: గత మూడు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రాజవొమ్మంగి కేంద్రంగా పని చేస్తున్న 108 సిబ్బంది వాపోయారు. ఈ మేరకు వారు గురువారం తహసీల్దార్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. డీఈఓ శ్రీనివాస్ తదితరులున్నారు.

కోతుల నుంచి రక్షణ కల్పించండి


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కూనవరం: మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువైందని, వాటిని ఊరు నుంచి దూరంగా తరిమేసి తమకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. ఊళ్లో తిరిగేందుకు భయమేస్తుందంటూ గురువారం పలువురు అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలో ఇప్పటివరకు 15 మందికి పైగా స్థానికులపై కోతులు దాడి చేశాయని, చిన్నారుల చేతుల్లో తినుబండారాళ్ల వంటిని తీసుకుపోతున్నాయని, గాయపరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోతులను అడవి ప్రాంతంలో తరలించాలని కోరుతూ అటవీ అధికారికి వినతిపత్రం అందజేశారు. డివిజనల్ పంచాయతీ అధికారికి పోస్టులో వినతిపత్రాన్ని పంపారు. సుమారు 130 మంది గ్రామస్తులు సంతకాలు చేసి వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. జెట్టి సత్యనారాయణ, గోపాలం, పాపాయమ్మ, మణికుమారి పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రకటించిన హామీలు అమలుచేయాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ: సీఎం చంద్రబాబునాయుడు గిరిజన యువకులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఎన్నికల సమయంలో అరకులో జరిగిన తెలుగుదేశం పార్టీ బహిరంగ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ గిరిజన యువతకు ఏజెన్సీలో 100 శాతం ఉపాధ్యాయ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ మేరకు జీవో నెంబర్ 3కి ప్రత్యామ్నాయ జీవో తీసుకొచ్చి గిరిజన యువతకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని లేనిపక్షంలో గిరిజనలందరితో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాకా సింహాచలం, పి.అశోక్‌కుమార్, సొనబరికి బాలరాజు, నియోజకవర్గ సోషల్ మీడియా, మండల ప్రదాన కార్యదర్శి పి.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఫిజియోథెరపీ సేవలు


చిన్నారులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను పరిశీలిస్తున్న ఎంఈవో బాబూరావు

జి.మాడుగుల: స్థానిక భవిత పాఠశాలలో ఫిజియోథెరపి సేవలు అందుబాటులోకి వచ్చాయి. భవిత పాఠశాలలో 80మంది చిన్నారులు ఉండగా వీరిలో కొందరు వివిధ రకాల వైకల్యంతో విభిన్న ప్రతిభావంతులుగా ఉన్నారు. వీరికి చాలా కాలంగా ఫిజియోథెరపీ సేవలు అందడం లేదు. ఇటీవల ఫిజియోథెరిపిస్ట్‌ను భవిత కేంద్రానికి నియమించారు. ఈ మేరకు ఫిజియోథెరిపిస్టుగా పీలా నాగేంద్ర ప్రతీ మండళవారం జి.మాడుగులలో భవిత కేంద్రంలో అందుబాటులో ఉంటారు. ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలోని అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఈవో సీహెచ్ బాబూరావుపడాల్, ఎంఆర్సీ సిబ్బంది, భవిత స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి


రైతులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అడ్డతీగల: మండలంలోని కిమ్మూరులో గురువారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పతంజలి ఫుడ్స్ ఫీల్డ్ ఆఫీసర్ సీహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. చీడపీడలు, తెగుళ్లు, గెలల నాణ్యత వంటి అంశాలను వివరించారు. ఈ ప్రాంత భూములకు పామాయిల్ పంట సాగు అనువైనదని క్లస్టర్ ఆఫీసర్ జె.చక్రబాబు చెప్పారు. కంపెనీతో పాటు ప్రభుత్వం ఈ పంట సాగుకి అనేక రాయితీలు ఇస్తుందన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్.రాంబాబు, ఫీల్డ్ సూపర్‌వైజర్ ఎస్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి


సూచనలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర, తహసీల్దార్ వేణుగోపాల్

వై.రామవరం: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోను పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తియాలని ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం 10,122 హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ చేయాలని సచివాలయాల సిబ్బందికి ఆదేశించారు. బ్యాంకు లబ్ధిదారులకు ఎస్‌పీఐఏ అనుసంధానం పెండింగ్‌లో ఉందని, వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రియాడ్రస్ సిస్టమ్‌పై అవగాహన కల్పించారు.ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను తప్పకుండా అందరూ పాటించాలని ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ పి.వేణుగోపాల్ మాట్లాడుతు రెవెన్యూ పరమైన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు.